మీ వార్త మాకు పంపండి: 92949 92992

17.07.2024 | కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల

సంపుటి 01 | సంచిక 90

TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

కాంప్లిమెంటరీ కాపీ www.telanganacapitalnews.com

పేజీలు 04

# మంత్రి పొన్నం ఒక్కరూపాయి తేలేదు

- పొన్నం పదవి చేపట్టి 8 నెలలు గడుస్తోంది...
- నగరపాలక సంస్థ అభివృద్ధికి నయా పైసా లేదు
- స్మార్ట్ సిటీ నిధులు తేవడంలో సంజయ్ కృషి ఉంది
- విజిలెన్స్, ఈడీ, సీబీఐ.. ఏ విచారణకైనా మేము సిద్ధం
- మేయర్ యాదగిరి సునీల్ రావు



(తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్)

కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగని చెందంగా కాంగ్రెస్ పార్టీ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయన అనుచరులు కనీస విషయ పరిజ్ఞానం లేకుండా విమర్శలు చేస్తున్నారని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ఫైర్ అయ్యారు. కరీంనగర్ లో మంగళవారం రోజు ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ ఆయన అనుచరులపై విరుచుకపడ్డారు. కనీస పరిజ్ఞానం లేకుండా నగరపాలక సంస్థ అభివృద్ధి మరియు పాలకవర్గంపై చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. గత నాలుగున్నర సంవత్సరాల్లో కరీంనగర్ నగరపాలక సంస్థ లో జరిగిన అభివృద్ధి పై విజిలెన్స్, ఈడీ, సీబిఐ లాంటి ఎలాంటి విచారణకైనా మా పాలకవర్గం సిద్ధంగా ఉందని పొన్నం ప్రభాకర్, ఆయన అనుచర వర్గానికి సవాల్ విసిరారు. దమ్ముంటే ఎలాంటి విచారణ అయినా చేస్కోవాలని... ఊకదంపుడు ఉపన్యాసాలు, బెదిరింపులకు బయపడేవారు లేరని సవాల్ చేశారు. పొన్నం ప్రభాకర్ మంత్రిగా పదవి చేపట్టి 8 నెలలు అవుతు న్నా... కరీంనగర్ నగరపాలక సంస్థకు నయా పైసా నిధులు తీస్కరాని చేతకాని మంత్రి అన్నారు. పొన్నం ప్రభాకర్ కు దమ్ముంటే నగరపాలక సంస్థ అభివృద్ధి కి 200 కోట్లు నిధులు తీస్కోని రావాలని సవాల్ విసిరారు. నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు తీస్కొస్తే స్వాగతిస్తామని తెలిపారు. మేయర్, కార్పోరేటర్లకు ఎలాంటి సమాచారం లేకుండా నగరపాలక సంస్థ పై సమీక్షా సమావేశం పెట్టిన పొన్నం ప్రభాకర్ మర్యాద గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. నగరపాలక సంస్థ కు జిల్లా కు ఎలాంటి సంబంధం లేని పొన్నం ప్రభాకర్, వారి అనుచరులు పదే పదే నగర అభివృద్ధి పై మాట్లాడటం చాలా విచారకరం అన్నారు. మా నూతన పాలకవర్గం రాకముందు 2017 జూన్ 23 న కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ నగరాన్ని స్మార్ట్ సిటీ గా ప్రకటించిందన్నారు. 31 జులై 2017న స్పెషల్ పర్పస్ వేకిల్ ఏర్పాటు చేసి.. 10 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. స్మార్ట్ సిటీ కార్పోరేషన్ లిమిటెడ్ ఏర్పాటు నుండి ఇప్పటి వరకు 17 సార్లు 10 మంది డైరెక్టర్లతో బోర్డు మీటింగ్ జరిగిందని.. 47 ప్రాజెక్టు అభివృద్ధి పనులకు అప్రూవల్ ఇచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. 10 మంది బోర్డు డైరెక్టర్ల నిర్ణయం మేరకే ప్రతి ప్రాజెక్టు పని సాంక్షన్ ఇచ్చి టెండర్లు పిలువడం జరుగుతుందని... ఇందులో ఎవరి సొంత నిర్ణయాలు ఉండవని తెల్చి చెప్పారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ లిమిటెడ్ లో మొత్తం 47 ప్రాజెక్టు పనులకు

- మిగతా 2లో..

## చెరువులను తలపిస్తున్న స్మార్ట్ సిటీ రోడ్లు

### అసమర్థ మేయర్ వెంటనే రాజీనామా చేయాలి

సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు



3

## గురుకులను సందర్శించిన కపంపల్లి

### ఏ సమస్యలున్నా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ



# మంత్రి పొన్నం ఒక్కరూపాయి తేలేదు

**మొదటిపేజీ తరువాయి..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో 934 కోట్లు రూపాయల నిధులు అన్నారు. ఇందులో 765 కోట్ల 62 లక్షలు ప్రాజెక్టు పనులకు విడుదల చేయగా... దానిలో 735 కోట్ల నిధులు కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ కు వచ్చాయని తెలిపారు. ఇందులో 732 కోట్ల రూపాయల నిధులను వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని తెలిపారు. స్మార్ట్ సిటీ లో మొత్తం 47 ప్రాజెక్టు పనులు రూపొందిస్తే ఇందులో 25 ప్రాజెక్టు పనులు పూర్తి కాగా.... 20 ప్రాజెక్టులు అండర్ ప్రోగ్రెస్, 2 ప్రాజెక్టులు టెండర్ స్టేజిలో ఉన్నాయని తెలిపారు. మా నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసే నాటికి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో కేవలం 25 లక్షల రూపాయల పని మాత్రమే జరిగిందని తెలిపారు. మా పాలకవర్గం నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, అప్పటి జిల్లా కలెక్టర్ల సహకారంతో ఇప్పటి వరకు 732 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేయడం అదే కరీంనగర్ అభివృద్ధి కి నిదర్శనం అన్నారు. ఇలాంటి విషయాలు మంత్రి పొన్నం ప్రభాకర్, వారి అనుచరులు, తాబేదారులకు తెలియదా...? అని ప్రశ్నించారు. ఎవరైతే సమస్యల మీద అవగాహన లేని వ్యక్తులు మాట్లాడుతున్నారో



వారు చెప్పాల్సిన అవసరం ఉందని మండి పడ్డారు. కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ ని మా పాలకవర్గం కలవడం కంటగింపుగా మారిందని అది ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. 2019 నుండి 2024 వరకు ఎంపీగా పనిచేసిన కాలంలో కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ కు నిధులు తీసుకురావడంలో బండి సంజయ్ పాత్ర ఉందని...కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం ఎవ్వరినైనా కలుస్తామని తేల్చి చెప్పారు. అమృత్ 1అండ్2 లో కేంద్రం నుండి నిధులు తేవడంతో పాటు రైల్వే ఓవర్ బ్రిడ్జ్ కు కూడ నిధులు తేవడంలో సంజయ్ పాత్ర ఉందని అన్నారు. మళ్లీ కేంద్ర కేబినెట్ మంత్రి అయ్యారు కాబట్టి కరీంనగర్ నగరపాలక సంస్థ మళ్లీ నిధులు తేవాలని మా పాలకవర్గం కలవడం జరిగిందని తెలిపారు.

**దమ్ముంటే 200 కోట్లు తేవాలి..**

మీకు దమ్ముంటే పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 200 కోట్లు నగరపాలక సంస్థ అభివృద్ధి తేవాలని అప్పుడు స్వాగతిస్తామని సవాల్ విసిరారు. 2019 నుండి 2024 వరకు మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ లు నగరపాలక సంస్థ అభివృద్ధి కి వందల కోట్ల నిధులు తెచ్చి నగరాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. పొన్నం ప్రభాకర్ 8 నెలలు గడిచినా మంత్రి గా నగర అభివృద్ధి కి ఒక్క రుపాయి నిధులు తెచ్చారా అని ప్రశ్నించారు. రూపాయి నిధులు తెని చేతకాని మంత్రి మీరు నగరపాలక సంస్థ అభివృద్ధి పై మాట్లాడటం చాలా విడ్డూరం అన్నారు. మీ ఊకదంపుడు మాటలు... బెదిరింపులకు బయపడే వారు లేరని అగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి పై మాట్లాడే హక్కు పొన్నం ప్రభాకర్ కు లేదని మండి పడ్డారు. కేబుల్ బ్రిడ్జ నిర్మాణం, ఆర్ %డ%బి రోడ్లు నిర్మాణం ఎవరు చేశారన్న పరిజ్ఞానం కూడ కాంగ్రెస్ నాయకులకు లేక పోవడం సిగ్గు చేటన్నారు. వాటికి నగరపాలక సంస్థ కు ఏం సంబంధం తెలియక పోతే తెలుసుకొని విమర్శలు చేయాలని మండి పడ్డారు. 2009 నుండి 2014 వరకు పొన్నం ప్రభాకర్ ఎంపిగా పని చేసి ఒక్క కాంగ్రెస్ నాయకునికి పదవి ఇప్పించిన చరిత్ర లేదు.... కాంగ్రెస్ పార్టీ నాయకులు జాగ్రత్త పడాలన్నారు. వారి అన్నదమ్ములకు తప్పా పార్టీలో పదవులు ఎవ్వరికి ఇప్పించని ఎద్దేవ చేశారు. చొక్కరావు శిష్యుడిని అనుకుంటూ గొప్పలు చెప్పుకునే పొన్నం ప్రభాకర్... చొక్కరావు గారిని మరియు వారి కొడుకును ఓడించిన వ్యక్తులకు ఎంపీ టికెట్ ఇప్పించిన చరిత్ర పొన్నందన్నారు. ఇలాంటి వ్యక్తులు కరీంనగర్ నగర అభివృద్ధి పై వాఖ్యలు చేయడం మంచిది కాదని ఎలాంటి విచారణకైనా మా పాలకవర్గం సిద్ధం అని సవాల్ విసిరారు. విచారణలో మీరు చేసిన అసత్యాలన్నీ తేలిపోతాయని అది మాకు మంచిదే అని అన్నారు. ఈ మీడియా సమావేశంలో కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవి మహేష్, బలేందర్ యాదవ్, కంసాల శ్రీనివాస్, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, కొండపల్లి సరిత సతీష్, సల్ల శారద రవీందర్, దిండిగాల మహేష్, ఎడ్ల సరిత అశోక్, నాంపల్లి శ్రీనివాస్, బోనాల శ్రీకాంత్, తుల శ్రీదేవి చంద్రమౌళి, కచ్చు రవీందర్, మేచినేని వనజ అశోక్ రావు, బీఆర్ఎస్ నాయకులు శరీర, అనిల్, హామీద్, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ బోనాల ఉత్సవం

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, వేములవాడ:** తెలంగాణ పండగ అంటే బోనాలకు పెట్టింది పేరు. ఏటా ఆ పాఠశాలలో అంగరంగ వైభవంగా యాజమాన్యం తెలంగాణ బోనాలను నిర్వహిస్తున్న తీరును చూసి పట్టాలవాసులు సైతం ఔరా....! అంటున్నారు. వేములవాడ పట్టణంలోని కేరళ మోడల్ స్కూల్ పాఠశాలలో ఏటా బోనాల ఉత్సవాలను యాజమాన్యం ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నది. పాఠశాల యాజమాన్యం కేరళ రాష్ట్రం చెందినవారు అయిన ఇక్కడి పండగ అయినా బోనాలు విద్యార్థులతో ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల వేషధారణలు చూసి పట్టణవాసులు సైతం ఆకర్షితులైతున్నారు. మంగళవారం నిర్వహించిన బోనాల ఉత్సవాలలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ మనోజ్ కార్యక్రమాన్ని ప్రారంభించగా విద్యార్థులు బోనాలను ఎత్తుకొని పాఠశాల నుండి బోనాలు ఊరేగింపు తెలంగాణ బద్ది పోచమ్మ ఆలయంలో వరకు డప్పు సప్పులతో పోతరాజుల విన్యాసాలతో కొనసాగింది. అనంతరం ఊరేగింపు ముగింపు తదుపరి కరస్పాండెంట్ మనోజ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణలో బోనాలకు పెట్టింది పేరు అని ప్రతి ఏటా శ్రావణ మాసంలో పాఠశాలలో బోనాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. అలాగే బోనాల పండుగ ప్రత్యేకత గురించి విద్యార్థులకు వివరించారు.

## తల్లిని చూసి వస్తూ అనంత లోకాలకు...

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్/సిద్దిపేట క్రైం:** కన్నతల్లిని చూసి వస్తూ ఆటోలో తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో వెనక నుండి కారు ఆటోను ఢీకొనడంతో బెజ్జంకి మండలంలోని రేగులపల్లి గ్రామానికి చెందిన కొమ్మెర లక్ష్మి 53 అక్కడికక్కడే మృతి చెందిందని స్థానికులు తెలిపారు. మృతురాలు చిగురుమామిడి మండలం గోనెవెంకన్నపల్లి గ్రామంలో తన తల్లిని చూసి మంగళవారం ఆటోలో రేగులపల్లికి తిరిగి వస్తుండగా వెనక వైపు నుండి హైదరాబాద్ వెళుతున్న కారు రాజీవ్ రహదారిపై శంకర్‌నగర్ గ్రామ శివారులో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాల పాలు కాగా హుటాహుటిన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినారు. మృతురాలు లక్ష్మికి భర్త రామ్ రెడ్డితో పాటు ఇరువురు కుమారులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి స్టడీ మెటీరియల్ అందజేత



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం వివేక్ తన చిన్నతనంలో తల్లి తండ్రులను కోల్పోయినాడు..శీలం వివేక్ కి రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుచు స్టడీ మెటీరీయల్ లేనందున అట్టి విషయం తెలుసుకున్న పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ శ్రీ గొడిశెల జితెందర్ గౌడ్ గారు శీలం వివేక్ కు ను అభినందించి తన వంతు సహాయంగా ( స్టడీ చేర్ ,బ్యాగ్ , ప్యాడ్ ) ను ఈ రోజు అందించి మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని వివేక్ తో అన్నారు..ముందు ముందు పై చదువుల కోరకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ గన్నేరువు వసంత నర్సయ్య,యువకులు సంజీత్,రజనీ కాంత్ ,జాన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్వోకు ముదిరాజ్‌ల వినతి

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం:** ముదిరాజ్ కుల బాంధవులు గన్నేరువరం మండల కేంద్రంలో మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ బిక్షపతి కి వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు బోయిని కుమార్ మాట్లాడుతూ కులం సర్టిఫికెట్ లో బీసీ–డీ సీరియల్ నంబర్ 19 గా ధృవికరణ పత్రాలు జారి చేస్తున్నారు. కానీ ప్రస్తుతం తమకు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసేటప్పుడు బీసీ–ఏ ముదిరాజ్ కులం బీసీ–ఏ లోకి మార్చాలని ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు రంగనవేణి లచ్చునర్సు,ఉపాధ్యక్షులు బోయిని మల్లయ్య, ముఖ్య సలహాదారులు పెద్ద మల్లయ్య, బోయిని కుమార్, బోయిని మధు, దుర్శుట్ల రాజు, రంగనవేణి సతీష్,నర్సయ్య, ముదిరాజ్ కుల బంధువులు పాల్గొన్నారు.



## అల్ఫోర్స్‌లో ఘనంగా మెహెంది

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలోని అల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం తొలి ఏకాదశి, మెహందీ వేడుకలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిల చేతులకు గోరింటాకు మెహందీ వివిధ డిజైన్ల ఆకారంలో ఎంతో అందంగా అలంకరించారు. వాతావరణంలో వచ్చే మార్పుల వలన ఎలాంటి వ్యాధులకు గురికాకుండా గోరింటాకు ఉపయోగపడుతుంది. అలాగే తొలి ఏకాదశి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

# చెరువులను తలపిస్తున్న స్మార్ట్ సిటీ రోడ్లు

- అసమర్థ మేయర్ వెంటనే రాజీనామా చేయాలి.
- సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** కరీంనగర్ నగరంలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు జేంకుతున్నారని రోడ్డు వేస్తామని సంవత్సరం క్రితం తవ్వి అలాగే వదిలేసారని తవ్వడం వల్ల ఆగిన 11వ డివిజన్ కట్ట రాంపూర్ నుండి గిద్ద పెరుమల్ల టెంపుల్ వెళ్లే రోడ్డులో గుంతలు పడ్డ రోడ్లపై సిపిఐ నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐనగర కార్యదర్శి కసిరెడ్డిసురేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలోని 11వ డివిజన్లో స్మార్ట్ సిటీలో భాగంగా రోడ్లు నిర్మిస్తామని తవ్వి వదిలిపెట్టడంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రజలు ప్రతిరోజు ఒకరు గుంతలో పడుతూ గాయాల పాలవుతున్నారని ఆరోపించారు. సంవత్సరం తరబడి ఇలాగే జరుగుతున్నా గాని స్థానిక కార్పొరేటర్,మేయర్ ఏ మాత్రం పట్టించుకోవడం సిగ్గుచేటైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు నగర మేయర్ సునీల్ రావు నగరాన్ని అభివృద్ధి చేసాం నగరంలో రోడ్లు వేసామని చెప్పే మేయర్ కి కట్ట రాంపూర్ లోని గుంతలు కనబడడం లేదా అని అయన సూటిగా ప్రశ్నించారు. నగరంలో గుంతలు కూడా పూడ్చలేని స్థితిలో మేయర్ ఉండడం సిగ్గుమాలిన చర్య అని నగరంలోని 60 డివిజన్లలో చాలా ప్రాంతాల్లో గుంతలు పడిన రోడ్లు ఉన్నాయని వీటిని పూడ్పించలేని చేతగాని మేయర్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నగరంలో అనేక వీధుల్లో ఇదే దుస్థితి ఉందని తిరుమల్ నగర్ రోడ్డు తవ్వి సంవత్సరం దాటిన అటువైపు కన్నెత్తి చూసే నాయకుడు లేకపోవడం వారి అవినీతి పాలనకు అర్థమవుతుందని ఆక్రోషం వ్యక్తం చేశారు. వెంటనే గుంతలు పడ్డ రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలని లేనిపక్షంలో మేయర్, కార్పొరేటర్, మున్సిపల్ అధికారులను నిలదీస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో 11వ డివిజన్ శాఖ కార్యదర్శి కశిబోజుల సంతోష్ చారి, మంద రాజ్ కుమార్, గడప శంకర్, మదర్ హెూలీ, షరీఫ్, హనీఫ్, రామకృష్ణ, సందీప్ తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.





# గురుకుల పాఠశాలను సందర్శించిన కవంపల్లి

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, తిమ్మాపూర్:** మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ నీ మంగళవారం ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు. పాఠశాల సందర్శనకు విచ్చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గారికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. దాదాపు రెండు గంటలపాటు పాఠశాల మొత్తం కలియ తిరిగి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు ఎమ్మెల్యే కవ్వంపల్లి దృష్టికి పలు సమస్యలు తీసుకరాగా అధికారులను పిలిపించి వెంటనే సమస్యలు పరిష్కారించాలి అని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుంది అని కావున గురుకుల పాఠశాలలో చదువుకొనే విద్యార్థులు ఇంటర్నేషనల్ పాఠశాలలా విద్యార్థులతో పోటీ పడి మంచి ఫలితాలు సాధించాలి అన్నారు. పాఠశాలలో కిచెన్ కూడా సందర్శించి విద్యార్థులకు మంచి నాణ్యమైన పౌష్టికహారం అందించాలని సిబ్బంది కి సూచించారు. ఈసారి పది మరియు ఇంటర్ ఫలితాల్లో మన మానకొండూర్ నియోజకవర్గంలోని గురుకుల పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాలని రాష్ట్ర స్థాయి లో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు మరియు ఆ క్లాస్ టీచర్ నా స్వంతంగా లక్ష రూపాయల ప్రైజ్ మని అందిస్తాను అన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకవస్తే వెంటనే వాటినీ పరిష్కారిస్తాను అని స్థానిక శాసనసభ్యుడిగా నా పై ఆ బాధ్యత ఉంది అన్నారు.

## అల్ఫోర్స్‌లో ప్రమాణ స్వీకారోత్సవం

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు చాలా అవసరమని, పాఠశాల పరిపాలనలో పాల్గొనవచ్చని తద్వారా చక్కటి పేరు సాధిస్తామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్లో వివిధ విభాగాల కెప్టెన్స్ మరియు వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలకు సమన్వయ పర్చడానికి ప్రమాణస్వీకారోత్సవం చాలా అట్టహాసంగా ని ర్వహించడమే కాకుండా వారు నిర్వర్తించే విధుల గూర్చి తెలిపి చక్కగా అమలు పరుస్తామని స్నేహపూర్వకంగా ఉంటామని ప్రమాణం చేయించారు.






## ఘనంగా రామకృష్ణ జన్మదిన వేడుకలు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కోనరావుపేట:** హిందూ టైగర్,భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జన్మదిన వేడుకలు బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టె రాంచంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.అనంతరం వేములవాడ వెళ్లి రామకృష్ణ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మండల అధ్యక్షుడు గొట్టె రాంచంద్రం, ప్రధానకార్యదర్శులు వెలిశాల రవి,బొల్లారం తిరుపతి, నాయకులు ఆకుల నాగరాజు, పోగుల లచ్చిరెడ్డి కొమ్ము తిరుపతి అసరి తిరుపతి,ఆసరి రాజు, కుమార్, దొడ్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ మాట-అంగన్వాడి బాట

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, సిరిసిల్ల:** పట్టణంలోని 13వ వార్డులో బాలలను అంగన్వాడి సెంటర్లో చేర్పించండి అని స్థానిక కౌన్సిలర్ శైలుశ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శైలు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లను బాలల సంరక్షణ మరియు పౌష్టికమైన ఆహారం మరియు నాణ్యమైన వారికి సంబంధించిన విద్యను బోధించడంలో అంగన్వాడి కేంద్రం కేంద్రాలను తికర్ణ శుద్ధితో ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారన్నారు. వీటిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ లక్కిరెడ్డి రజిని,ఆశ వర్కర్ వర్షా, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా శాకాంబరీ ఉత్సవాలు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీ దుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరీ ఉత్సవాలలోభాగంగా మంగళవారం అమ్మవారిని ఆలుచింతల మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# గీత కార్మికులను అన్నివిధాలా ఆదుకోవాలి

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** రాష్ట్రంలోని గౌడ సోదరులను అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని గౌడ సంఘం మండలం నాయకుడు బుర్ర అంజయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాటి చెట్లు ఎక్కడానికి గౌడ సోదరులకు మోకులు ఇవ్వడం హర్షనీయమని , అలాగే వనానికి వెళ్లడానికి ఒక మోటార్ బైక్ ఇవ్వాలని, అదేవిధంగా తాటి చెట్టు ఎక్కి అకాల మరణం చెందిన వారికి పది లక్షల భీమా ఇవ్వాలని, చెట్టు పై నుంచి పడి గాయపడిన వారికి ఐదు లక్షలు ఇవ్వాలని, ప్రతి సొసైటీ కి ఐదు ఎకరాల భూమి తాటి చెట్లు,ఈత చెట్లు, చెట్లు పెంచడానికి కేటాయించాలని , ఐదు వేల పెన్షన్ ప్రకటించాలని, ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, గ్రామాల్లో బెల్టు షాపులు తీసివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



# సంజయ్‌కి పొన్నం బహిరంగ లేఖ



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం మరియు ప్రత్యేకంగా కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చే బడ్జెట్ సెషన్‌లో తగినంత బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖలో కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం.. మిడ్ మానేరు, గౌరవెల్లి ప్రాజెక్ట్ భూనిర్వాసిత బాధిత కుటుంబాలకు సూక్ష్మ ,చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన.. శాతవాహన విశ్వవిద్యాలయానికి 200 కోట్ల ఆర్థిక సహాయం అందించడం.. కరీంనగర్ తిరుపతి మధ్య నడిచే బై వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు ప్రతి రోజు నడిచేలా చేయాలి.. కరీంనగర్ మరియు షిర్డీ మధ్య రైల్వే మార్గం డబ్లింగ్‌ను వేగవంతం చేయడం.. హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజీ మంజూరు.. కొత్తపల్లి నుండి జనగాం జాతీయ రహదారి మంజూరు.. సిరిసిల్ల టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి నిధులు.. వేములవాడ, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి నిధులు.. ఎన్‌ఎల్‌ఎం, పీఎంఈజీ మరియు ఎన్‌హెచ్‌ఎం పథకాల కిందతగినంత బడ్జెట్ కేటాయింపు.. రాబోయే బడ్జెట్ సమావేశాలలో పైన పేర్కొన్న అభివృద్ధి పనులను కార్యరూపం దాల్చేందుకు కరీంనగర్ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఉపయోగించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర-రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచడంలో కేంద్ర ప్రభుత్వానికి తన మద్దతును అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ విషయంలో రాష్ట్ర విభజన సమయంలో మన రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతగా వ్యవహరించాలి.. రాష్ట్రానికి కేంద్రం నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రిగా మీ పాత్ర చాలా కీలకమైంది. నేను రాష్ట్ర మంత్రిగా మరియు కరీంనగర్ బిడ్డ గా, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైన బడ్జెట్ కోసం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అభివృద్ధి పనుల గురించి మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను అని పేర్కొన్నారు.

# రుణమాఫీ జీవోను సవరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.567 ప్రకారం రైతుల రుణమాఫీకి రూపొందించిన నిబంధనలలో గల అంశాలను సవరించి 2లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధి కలిగేటట్లు మార్గదర్శకాలను సవరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజున ముకుంద లాల్ మిశ్రా భవన్లో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదనిపిస్తుందని అన్నారు. కొత్త మార్గదర్శకాలు రుణమాఫీ లక్ష్యానికి గండి కొట్టినట్లే అన్నారు. ఇటీవల రాష్ట్రముఖ్యమంత్రి రేషన్ కార్డు ప్రామాణికం కాదని చెప్పారని, అంతలోనే ఏమైందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా రేషన్ కార్డును ప్రామాణికం చేయడం సమంజసం కాదన్నారు. ఈ జీవో రైతుల నోట్లో మట్టి కొట్టినట్లు అవుతుందన్నారు.రేషన్‌కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా లక్షల సంఖ్యలో ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినాడు నుండి ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. వ్యవసాయం కొరకు రుణం తీసుకున్న సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (స్వయం సహాయక బృందాలు) జాయింట్ లయబిలిటీ గ్రూప్, రైతు మిత్ర గ్రూప్, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజిబిలిటీ కార్డు ఉన్న వారికి రుణ మాఫీ వర్తించదని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రీ షెడ్యూల్ చేసిన రుణాలకు కూడా రుణమాఫీ వర్తించదని నిబంధన చెబుతున్నదని,గతంలో కరువులు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు బ్యాంకులు రుణాలు సంవత్సరాల వాయిదాలపై రీ షెడ్యూల్ చేశారని గుర్తు చేశారు. వీరికి రుణమాఫీ వర్తించదడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సుంకరీ సంపత్, నాయకులు పున్నం రవి, జి శ్రీకాంత్ ,రాయి కంటి శ్రీనివాస్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ దీక్ష

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, సిరిసిల్ల:** బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రవి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హాస్టల్స్ పునఃప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తోన్న హాస్టళ్ల మాత్రం వసతులు లేమితో కొట్టిమిట్టడుతున్నాయని, అపరిశుభ్రత వాతావరణం, విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిన పరిసరాలు, పాములు, తేళ్లు, విషపురుగులు, అపరిశుభ్రంగా మారిన టాయిలెట్లతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్లో పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుందని, విద్యార్థులకు సరైన ఆహారం అందట్లేదని, హాస్టల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. హాస్టల్‌లలో అన్ని వసతులు కల్పించకపోతే మేము ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడం వెంకటేష్, శ్రీనివాస్,తిరుపతి, పోతర్ల వంశీ, కోడి రోహిత్, తెంబరవేని శ్రీనివాస్, వావిలాల సాయికుమార్, గుత్తికొండ జయచందర్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్, బిఆర్ఎస్ మైనార్టీ నాయకులవి మతిలేని వ్యాఖ్యలు

బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, కరీంనగర్:** కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను అన్ని పార్టీల నేతలు కలుస్తుంటే, కొంతమంది కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగకుతున్నారని , తమ స్వార్థ రాజకీయాల కోసం బండి సంజయ్ కుమార్ పై పనికిమాలిన విమర్శలు చేస్తూ ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని , దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ అన్నారు. సోమవారం కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ ఈద్గా, మసీదుల విషయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడిన వ్యాఖ్యలను కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నేతలు వక్రీకరించి ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు చేయడం మంచిది కాదన్నారు. కాంగ్రెస్, ఎంఐఎంలకే స్నేహపూర్వక బంధాలు ఉన్నాయని, అందుకే పనిగట్టుకొని బిజెపి పై, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతోనే బండి సంజయ్ కుమార్ అన్ని వర్గాల అభివృద్ధి శ్రేయస్సు కోసం కృషి చేశారని అన్నారు.

# ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బతుకులు మారుతలేవు

ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్ కుమార్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, సిరిసిల్ల:** రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన విద్యార్థుల బతుకులు మారట్లేదని ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్ కుమార్ అన్నారు.మంగళవారం ఏబీవీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని ఈ సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. విద్యార్థులు సంఖ్యకు అనుకూలంగా ఉపాధ్యయులను నియమించాలని, జిల్లాలో కొన్ని పాఠశాలల్లో సబ్జెక్టు లకు ఉపాధ్యాయులే లేరని అలాగే కొన్ని పాఠశాలలో విద్యార్థులు ఉన్న ఉపాధ్యాయులు లేరని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పట్టించుకోకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. అనేక పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు సరిపోక చెట్ల కిందనే విద్యార్థులు చెట్ల కిందనే చదువు కుంటున్నర్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్, ఏబీవీపీ వింగ్ ఎస్ఎఫ్‌డి జిల్లా కన్వీనర్ లోసెల్లి రాజు రావు, ఎలగందుల శ్రీనివాస్,కాసారపు నితిన్,అఖిల్, గౌతమ్,సాయి, జగన్, అఖిల్ పాల్గొన్నారు




